క్లుప్తంగా

భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

అమరావతి: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం అమరావతికి విచ్చేసే భక్తులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే అమరేశ్వరస్వామి దేవస్థానం నుంచి బస్టాండు వరకు భక్తులకు ఉచితంగా ప్రయాణించేలా ఆటోలను ఏర్పాటు చేశారు. వాసవి నిత్యాన్నదానసత్రంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ ప్రారంభించారు. అలాగే అమరలింగేశ్వర కాపుసేవా సంఘం ఆధ్వర్యంలో సదావర్తిసత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పలు స్వచ్ఛంధ సేవా సంస్థలు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశాయి.

ఫ్యాను గుర్తుకు ఓటు వేయండి



ఊటుకూరు (క్రోసూరు): క్రోసూరు మండలం, ఊటుకూరు గ్రామంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయడు నియోజకవర్గ యువ నాయకులు కళ్యాణ్ చక్రవర్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఫ్యాను గుర్తుకే ఓటు వేయాలని ప్రజల్ని, మహిళల్ని కోరారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నంబూరు శంకరరావును, అనిల్ కుమార్ యాదవ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. సీఎం జగనన్న పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారన్నారు. నవరత్నాల పథకాలు అమలు చేసి పేదలందరికీ లబ్ధి చేకూర్చారన్నారు. అదే విధంగా జగనన్న ఆదేశాల మేరకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పెదకూరపాడు నియోజకవర్గంలో అహర్నిశలు పేదల కోసం పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలందరినీ కలుపుకుని పోతున్న ఏకైక నాయకుడు మన శంకరరావు అని అన్నారు. అదే విధంగా పార్లమెంట్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను కూడా ప్రజలు గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీ కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా, షేక్ గఫూర్ పాల్గొన్నారు.

క్షతగాత్ర కూలీలకు పరామర్శ



క్రోసూరు: రాయచూరు నుంచి మిర్చి కోతల కూలీ పనులకు మండలంలోని గాదెవారిపాలెం గ్రామానికి వచ్చిన వ్యవసాయ కూలీలు వెళ్తున్న ట్రాక్టర్ గురువారం బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన కూలీలను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శుక్రవారం పరామర్శించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించిన అనంతరం క్షతగాత్రులందరికీ మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట గాదెవారిపాలెం సర్పంచ్ దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి ఉన్నారు.

నేడు మండలంలో మంత్రి అంబటి పర్యటన

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 9న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పర్యటన జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. బుల్లెట్ వాహనంపై ఉదయం 6.30 గంటలకు మంత్రి నివాసం వద్ద నుంచి బయలు దేరి ఇరుకుపాలెం, మాదల, రుద్రవరం, తొండపి, దమ్మాలపాడు, బొల్లవరం గ్రామాల్లో పర్యటించి స్థానిక నేతలతో సమావేశమవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, క్రియాశీలక కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలిపి వేయబడుతుందని ఏఈ భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

కోటప్పకొండ, అమరావతికి ప్రత్యేక బస్సులు

సత్తెనపల్లి: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి కోటప్పకొండ, అమరావతి పుణ్యక్షేత్రాల సందర్శనకు 28 ప్రత్యేక బస్సులు ఆర్టీసీ నడిపింది. పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి అమరావతికి-10, కోటప్పకొండకు-18 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుణ్యక్షేత్రాలను సందర్శించారు.

హరహర మహాదేవ.. శంభో శంకరా..

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పర్వదిన వేడుకలు
- భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నసంతర్పణలు

సత్తెనపల్లి: నియోజకవర్గ వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదిన వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులతో శైవ క్షేత్రాలన్నీ శివనామ స్మరణతో హోరెత్తాయి. ఆది దంపతులైన శివపార్వతులను దర్శించుకునేందుకు భక్తజనం తండోప తండాలుగా తరలివచ్చారు. పట్టణంలోని అచ్చంపేటరోడ్‌లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వర స్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, పట్టణంలోని త్రిశక్తి దుర్గా పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో అభిషేకాలు, రుద్రహోమం, మహాపూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో రాత్రంతా భజన, భక్తి గీతాలతో భక్తులు జాగరణ చేపట్టారు. ఓం నమఃశివాయ, హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల నామస్మరణతో శైవ క్షేత్రాలు మారుమోగాయి. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో భక్తులకు అన్నసంతర్పణలు నిర్వహించారు. శ్రీదుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక పూజలకు హాజరుకాగా దేవదాయ శాఖ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజల అనంతరం మంత్రి అంబటి అన్నసంతర్పణను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవతి సుబ్బారావు, 23వ వార్డు కౌన్సిలర్ ఆకుల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు బచ్చు వీర వెంకట మురళీకృష్ణ, భవనం సీతామహాలక్ష్మి, విప్పర్ల ఆదిలక్ష్మి, కొమ్మూరి వెంకాయమ్మ, అంకాళ ప్రభుదాసు, ధనావత్తు లక్ష్మీబాయ్, చదలవాడ సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

కిటకిటలాడిన శివాలయాలు

అచ్చంపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని పలు శివాలయాలలో శుక్రవారం స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే శివాలయాలలో భక్తులు బారులు తీరారు. చామర్రులోని పవిత్ర కృష్ణానది ఒడ్డున వేంచేసియున్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో చండీ, శాంతి కల్యాణ యాగాలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్థానిక హరిహర క్షేత్రంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తిమ్మిశెట్టి సాంబయ్య బృంద సభ్యులు భజన కార్యక్రమాలు చేపట్టారు. గో పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మాదిపాడులోని నందుల రేవుకు సమీపంలోని శివాలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. కృష్ణానదికి ఆవలి ఒడ్డున గల ముక్తేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.



పెద్దమక్కెనలో ప్రత్యేక అలంకరణలో గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి



అచ్చంపేట హరిహర క్షేత్రంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వారు

మహాశివరాత్రి ప్రత్యేక పూజలు

క్రోసూరు: మహాశివరాత్రి పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రోసూరు, దొడ్లేరు, ఊటుకూరు, బయ్యవరం, పీసపాడు, 88త్యాళ్లూరు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి పురస్కరించుకుని అనేక మంది భక్తులు అమరావతి, కోటప్పకొండల్లోని శైవక్షేత్రాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. బస్సులు, ఆటోలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రమైన క్రోసూరులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ కమిటీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముప్పాళ్ళలో ఘనంగా మహాశివరాత్రి

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో స్వామి వార్లకు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముప్పాళ్ళలోని కాశీఅన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం, భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాదలలోని సంగమేశ్వరస్వామి ఆలయం, నార్నెపాడులోని శంభులింగేశ్వరస్వామి, దమ్మాలపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి, కుందురువారిపాలెంలోని సాందీపని ఆశ్రమంలోను స్వామి వారికి విశేష పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి దాటాక ఆయా ఆలయాల్లో స్వామి వారికి లింగోద్భవ కాల అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.



పెదకూరపాడులోని రామలింగేశ్వరస్వామి

వైభవంగా శివరాత్రి వేడుకలు

బెల్లంకొండ: మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం శివరాత్రి పర్వదిన వేడుకలు వైభవంగా జరిగాయి. మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం, చండ్రాజుపాలెం, కండిపాడు, గంగిరెడ్డిపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, వెంకటాయపాలెం, నందిరాజుపాలెం గ్రామాలలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు వేకువజామున పుణ్యస్నానాలు ఆచరించి పరమేశ్వరుని దర్శనానికి ఆలయాలకు తరలి వెళ్లారు. మన్నెసుల్తాన్‌పాలెం అటవీ ప్రాంతం పరిధిలో ఉన్న గుడిబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. పాపాయపాలెం గ్రామంలోని బుగ్గ మల్లేశ్వరస్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బెల్లంకొండలోని నాగేశ్వర, గౌతమేశ్వర శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. వెంకటాయపాలెంలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామికి గ్రామస్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని అన్ని శివాలయాలలో రాత్రి స్వామి వారి కల్యాణ వేడుకలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని వివిధ ఆలయాలలో ప్రభలు ఆకట్టుకున్నాయి. పాపాయపాలెం గ్రామంలోని బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణ ప్రభలతో నిండిపోయింది.

శివనాస్మరణతో మార్మోగిన శివాలయాలు

పెదకూరపాడు: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు శివనాస్మరణతో మారుమోగాయి. పెదకూరపాడులోని పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, 75 త్యాళ్లూరులోని శివాలయం, చినమక్కెన, లగడపాడు, కంబంపాడు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

మహాశివరాత్రి పర్వదినాన కిక్కిరిసిన ఆలయాలు

నకరికల్లు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని ప్రముఖ ఆలయాలన్నీ శుక్రవారం కిటకిటలాడాయి. దక్షిణ కాశీగా ప్రసిద్ధికెక్కిన చేజర్ల గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత కపోతేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. అర్చకులు వెంకట్రామయ్య శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. నరసరావుపేట ఆర్డీవో బి.సరోజిని కపోతేశ్వరస్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. నర్శింగపాడు గ్రామంలోని పురాతన ఆలయమైన అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో, మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 24గంటల ఏకాహం స్వామివారి వారి నామంతో ప్రారంభించారు. శుక్రవారం రాత్రి జాగరణ అనంతరం శనివారం స్వామివారికి అన్నాభిషేకం, అన్నదానంచేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేచవరం గ్రామంలో మల్లేశ్వరస్వామి దేవస్థానంలో, గుండ్లపల్లి గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానం, చల్లగుండ్లలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొన్నారు.



శ్రీదుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో మంత్రి అంబటి రాంబాబు



ముప్పాళ్ళలోని శివాలయంలో స్వామి వారి కల్యాణ వేడుకలో భక్తులు



దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో అన్నసంతర్పణ ప్రారంభిస్తున్న మంత్రి అంబటి



సత్తెనపల్లిలోని త్రికోటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు



కపోతేశ్వరస్వామి వారిని దర్శించుకున్న నరసరావుపేట ఆర్డీవో సరోజిని



చేజర్ల గ్రామంలోని కపోతేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజల్లో భక్తజనం

అమరేశ్వరుని దర్శించుకున్న ప్రముఖులు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరుని శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు తొలుత ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వర స్వామికి, బాలచాముండేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. శివరాత్రి సందర్భంగా అమరేశ్వరుని మాజీ కలెక్టర్ లక్ష్మీకాంతం, సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నంబూరు బాబురావు, ఎండ్రాయి సర్పంచ్ నాయుడు రాంబాబు, మండల స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు దర్శించుకున్నారు.



మంత్రి అంబటి రాంబాబును ఆశీర్వదిస్తున్న అర్చకులు

సమాజాభివృద్ధిలో ఆమె కీలకం

సత్తెనపల్లి: సమాజాభివృద్ధిలో మహిళలు కీలకమని, వారిని గౌరవించడం అందరూ కర్తవ్యంగా భావించాలని పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యూఎస్ఎల్ కవిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని వడ్డవల్లి ఎంపీపీఎస్ (హెచ్ఈ) ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ కవిత మాట్లాడుతూ సమాజంలో మహిళల ఉన్నతికి విద్య ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. చిన్న నాటి నుంచి బాలికలు ధైర్య సాహసాలతో ముందుకు సాగాలన్నారు. చిన్నారులకు హెల్త్ టిప్స్ వివరించారు. హెచ్ఎం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో స్త్రీ వివక్షను నిర్మూలించాలని, బాలికలు అనే వివక్ష లేకుండా చదివించాలన్నారు. కౌన్సిలర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదని, సమాజంలో స్త్రీలను గౌరవించాలన్నారు. సమాజంలో మహిళలు రాజకీయంగా, సామాజికంగా, అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయినులు రెహానా, కనకదుర్గ, పణిదం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కవితలను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ జడ కలేభు, విద్యార్థులున్నారు.

మహిళల త్యాగం వెలకట్టలేనిది

సత్తెనపల్లి: సమాజాభివృద్ధి కోసం, కుటుంబం కోసం మహిళలు చేసే త్యాగం వెలకట్టలేనిదని ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడారు. సమాజంలో మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలందరికీ సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరం అన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి వైద్యశాల గర్వించదగ్గ వైద్యశాలగా తీర్చిదిద్దామని, కార్పొరేట్ వైద్యశాలలో అందే వైద్యం ఇక్కడ అందుతుందన్నారు. వైద్యశాలలో 70 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారన్నారు. వారిని సన్మానించి ప్రోత్సహించడం వల్ల వారి బాధ్యతను పెంచినట్లు అవుతుందని, తద్వారా రోగులకి మరింత సేవ చేసే అవకాశం కలుగుతుందన్నారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి మహిళా వైద్యులను, ఈ నెలలో ప్రతిభ కనబరిచిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, గైనకాలజిస్టులు డాక్టర్ సుజాత, డాక్టర్ సుష్మ, మహిళ వైద్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

బెల్లంకొండ: ప్రతి మహిళ చదువుకుని, అన్ని రంగాలలో ప్రతిభ కనబరిస్తే సమాజంలో ఉన్నతమైన గుర్తింపు లభిస్తుందని గ్రేస్ మహిళా మండలి అధ్యక్షురాలు దుగ్గి కీర్తన పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీలోని పాఠశాలలో గ్రేస్ మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో అత్యుత్తమ స్థాయిలో ఉన్న మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ నుంచి లోక్‌సభ స్పీకర్ పదవి వరకూ మహిళలు బాధ్యతలు చేపడుతున్నారని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఈ సందర్భంగా వక్తలు తెలిపారు. మహిళా పోలీస్ మానిక, పాస్టర్ సామేలు, మండలి సభ్యులు అంజమ్మ, ఎలిజబెత్, దేవ కరుణమ్మ, వీరమ్మ, మునెమ్మ పాల్గొన్నారు.

పురుషుల భాగస్వామ్యం అవసరం

సత్తెనపల్లి: సమానత్వం కోసం అన్ని చోట్ల మహిళలు సాగిస్తున్న పోరాటాల్లో పురుషుల భాగస్వామ్యం కూడా అవసరమని గోగులపాడు మాజీ సర్పంచ్ సిద్దెల కోటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమ్మా చేయూత చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం మార్చి 8న మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకుంటారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, పలు సామాజిక సంస్థలు మహిళలు సాధించిన విజయాలను గుర్తించి వారిని గౌరవించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ముందుగా అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో దాత మోదుగుల బాబ్జి కుమార్ సహకారంతో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళ దినోత్సవం

పెదకూరపాడు: స్థానిక మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పెదకూరపాడులోని మాగులూరి ఫౌండేషన్ కార్యాలయంలో మహిళలు కేక్ కట్ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ సమాజానికి మహిళలే వెన్నెముక అన్నారు. మహిళల అభ్యున్నతికి మాగులూరి ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు.

సమాన భాగస్వామ్యంతో సమాజాభివృద్ధి

సత్తెనపల్లి: అన్ని రంగాల్లోనూ మహిళలకు సమాన భాగస్వామ్యం, సముచిత స్థానం కల్పించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందని వి 204/ఏ వాసవి క్లబ్ ఫ్యామిలీస్ డిస్ట్రిక్ గవర్నర్ కట్టమూరు అప్పారావు అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని వి 204/ఏ వాసవి క్లబ్ ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో సేవలందిస్తున్న మహిళ వైద్యులను శుక్రవారం సత్కరించారు. అప్పారావు మాట్లాడుతూ మహిళలు ఎవరికీ తక్కువ కాదనే ఆలోచన మనలో ఉండాలన్నారు. క్లబ్ అదనపు వైస్ గవర్నర్ వెంకట హరేరామ చెంచయ్య మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అన్ని రంగాల్లో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. క్లబ్ అధ్యక్షుడు నరసింహారావు మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో అత్యుత్తమ సేవలు అందించడంలో మహిళా వైద్యులు, మహిళా సిబ్బంది నిరంతర కృషి వెలకట్టలేనిదన్నారు. వైద్యశాలలో విశిష్ట సేవలు అందిస్తున్న ఆర్ఎంవో శోభారాణి, గైనకాలజిస్టులు డాక్టర్ సుజాత, డాక్టర్ సుష్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధలను క్లబ్ కార్యదర్శి వనమా రాజ్యలక్ష్మి సత్కరించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ కొత్త రామకృష్ణ, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, వాసవి డైమండ్ క్లబ్ సత్తెనపల్లి అధ్యక్షుడు కోటేశ్వరరావు, కాశి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న ఉపాధ్యాయినులు, వైద్యాధికారితో కౌన్సిలర్ శ్రీనివాసరావు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అమ్మా చేయూత చారిటబుల్ సొసైటీ సభ్యులు



సత్కారం అందుకున్న మహిళా వైద్యులు, సిబ్బందితో సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ రామకృష్ణ



బెల్లంకొండ మహిళ దినోత్సవ వేడుకలలో సభ్యులు, మహిళలు

వేసవి నీటి ఎద్దడికి చర్యలు



గార్లపాడు సమీపంలోని మంచినీటి చెరువును పరిశీలిస్తున్న చైర్ పర్సన్ లక్ష్మీతులసి

సత్తెనపల్లి: నాగార్జునసాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయడంతో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు మున్సిపల్ యంత్రాంగం మూడు మోటార్లతో గార్లపాడు సమీపంలోని మంచినీటి చెరువును నింపేందుకు యత్నిస్తుంది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని కోటప్పకొండ భక్తుల సౌకర్యార్థం నాగార్జునసాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయడంతో మున్సిపల్ అధికారులు పట్టణంలోని మంచినీటి చెరువును నింపుతున్నారు. మొత్తం మూడు మోటార్లను ఏర్పాటు చేసి రోజుకు 15 మిలియన్ లీటర్లు చొప్పున చెరువు నింపే ప్రయత్నం చేపట్టారు. ఇప్పటికే చెరువులో 400 మిలియన్ లీటర్ల నీరు ఉంది. మంచినీటి చెరువును పూర్తి స్థాయిలో నింపగలిగితే రానున్న వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు ఉండవు. అయితే కుడి కాలువకు నీరు ఎప్పుడు నిలిపివేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి మంచినీటి చెరువుకు నీటిని నింపడాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమెతో పాటు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, తదితరులు ఉన్నారు.

'దీని ఇజితేమ'ను జయప్రదం చేయండి

క్రోసూరు: గుంటూరులోని పొన్నూరు రోడ్డులో గల ఆంధ్ర ముస్లిం కళాశాల ఎదురుగా ఉన్న మర్కస్ మసీదులో ఈ నెల 10వ తేదీ సాయంత్రం జరిగే దీని ఇజితేమ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మండల నూర్ బాషా సంఘం కార్యదర్శి షేక్ మస్తాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహమ్మద్ ప్రవక్త చెప్పిన బోధనలు, ఇస్లాంలోని బోధనా సారాంశాలు తెలియజేసేందుకు హైదరాబాద్ నుంచి పలువురు మత గురువులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇజితేమ కార్యక్రమం తెలుగులో చెప్పబడుతుందన్నారు. మహిళలకు ప్రత్యేక స్థలం కేటాయించబడుతుందన్నారు. కావున ముస్లిం సోదరులందరూ ఈ సభలో అశేషంగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.